**కథ**

# ఆమె ఎవరు...?

**కారు డ్రైవ్ చేస్తున్న రమణ మనసు అలజడిగా వుంది. వాచీలో టైం చూశాడు. పది గంటలు కావస్తూంది.**

**మామగారు కారు కొనిచ్చి మూడు నెలలే అయినా బాగా డ్రైవింగ్ నేర్చుకొన్నాడు. ఆ రోజు ఉదయాన్నే కారులో భార్యతో బయలుదేరి చెన్నైలో ఆమెను పుట్టింట్లో డ్రాప్ చేశాడు. మరుసటిరోజు ఆఫీస్‌కి అటెండ్ కావాలి కనుక రాత్రి త్వరగా భోజనం ముగించుకొని ఎనిమిది గంటలకు తిరుపతికి బయలుదేరాడు.**

'తిరుపతి చేరేసరికి పదకొండు గంటలవుతుంది' అనుకొన్నాడు మనసులో.

ఇంతలో అతని దృష్టి ఎదురుగా రోడ్డుపై నిలుచుని చేయి ఊపుతున్న యువతిపై పడింది. ఒక్క క్షణం భయమేసింది రమణకు.

'ఆమె ఎవరు? ఎందుకు యింత నిర్మానుష్యమైన ప్రదేశంలో ఒంటరిగా ఉంది? కొంపదీసి దయ్యం కాదు కదా?' ఆ క్షణంలోనే ఎన్నో ఆలోచనలు కలిగాయి అతనికి.

ఈమధ్యనే టీవీలో చూసిన సినిమా గుర్తొచ్చింది అతనికి. భయంతో ఒళ్ళంతా చెమటలు పట్టింది. వేగంగా వెళ్ళిపోవాలనే అనుకున్నాడు కానీ ఆమె దాదాపురోడ్డుకు అడ్డంగా వచ్చి నిలబడింది. తప్పనిసరై బ్రేక్ వేసి కారు ఆపాడు.

కారు కిటికీలో నుంచి చూస్తూ అతనితో- ''ఎక్స్‌క్యూజ్ మీ. ఆర్ యు గోయింగ్ టు తిరుపతి'' అంది.

''ఎస్'' అన్నాడు ఎలాగో గొంతు పెగల్చుకొని.

''కెన్ యు డ్రాప్ మి ఎట్ తిరుపతి. నా కారు బ్రేక్ డౌన్ అయ్యింది'' అంది దూరంగా చెయ్యి చూపిస్తూ.

''కమ్'' డోరు తీస్తూ అన్నాడు.

''వన్ మినిట్. నా సూట్‌కేస్ కారులోనే ఉంది. చీకట్లో వెళ్ళాలంటే భయంగా ఉంది. మీరు నాకు తోడుగా వచ్చారంటే నా సూట్‌కేస్ తెచ్చుకుంటాను''

అతనికి నమ్మాలనిపించలేదు ఆమె మాటలు. 'ఆమె ఏదైనా దారి దోపిడీ ముఠా తాలూకు మనిషి అయి ఉండవచ్చు. తను కారు దిగి ఆమె చెప్పిన చోటికి వెళ్తే ఆమె ముఠావాళ్ళు తనను కొట్టి తన పర్సు లాక్కొంటారేమో' అనుకొన్నాడు.

అతడు భయపడుతున్నాడని గ్రహించిందామె.

''ప్లీజ్. నన్ను నమ్మండి. అయామ్ ఎ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇన్ యుఎస్‌ఏ'' అంది.

అతనికి ఒక ఆడపిల్ల ముందు అలా భయపడటం అవమానం అనిపించింది. మొండి ధైర్యం కూడా వచ్చింది. కారు దిగి ''పదండి'' అన్నాడు ఆమెతో. అయితే ఎవరైనా దాడి చేస్తే ఎదుర్కోవడానికి సిద్ధమౌతూ చుట్టూ చూస్తూ నడవసాగాడు.

ఆమె కారు డోర్ తెరచి సూట్‌కేస్ తీసుకొని షట్టర్స్ పైకి లేపి డోర్ లాక్ చేసింది. కారు రోడ్డు మీద నుంచి పక్కకు జారిపోయి కొంతదూరంలో ఆగి ఉంది. స్టీరింగ్ కంట్రోల్ తప్పిందని అర్థమైంది అతనికి. అయితే బ్రేక్‌డౌన్ ఎందుకు అయ్యిందో అనుకొన్నాడు. అదే ఆమెని అడిగాడు.

''పెట్రోలు అయిపోయినట్లుంది. నేనూ చూసుకోలేదు. పైగా ట్యాంకు నుంచి లీక్ అవుతున్నదేమోనని నా అనుమానం'' అంటూ నడవసాగింది. కారులో ఇద్దరూ కూర్చున్నాక స్టార్ట్ చేశాడు రమణ. కారు కదిలాక అతని టెన్షన్ తగ్గింది. 'తను అనవసరంగా భయపడ్డాడు' అనుకొన్నాడు మనసులో.

ఆమె సూట్‌కేసు వెనుక సీటులో పెడుతున్నప్పుడు కారు లోపలి లైటు వెలుతురులో ఆమెని చూశాడు. చాలా అందంగా ఉంది. చూస్తున్న కొద్దీ యింకా యింకా చూడాలనిపిస్తోంది అతనికి.

''ఇంత చీకట్లో ఒంటరిగా ఎలా గడిపారు యింత సేపూ? బస్సులు ఏవీ రాలేదా?''

''లేదు. కారు ఆగిపోయిన అయిదు నిముషాల్లో మీ కారు. కనిపించింది. ఆ అయిదు నిమిషాలూ భయంతో వణికిపోయాను. భగవంతుడి దయవల్ల మీరు వచ్చారు''

ఆమె మాటల్లో వినిపించినంత ఆందోళన ఆమె ముఖంలో కనిపించకపోవడం అతన్ని ఆశ్చర్యపరచింది.

''అమెరికాలో ఎంత కాలంగా ఉంటున్నారు?''

''గత మూడేళ్ళుగా. నా చదువు కాగానే అక్కడికి వెళ్ళిపోయాను. మా అన్నయ్య ఇదివరకే అక్కడ సెటిల్ అయి ఉన్నాడు. నాకూ ఓ మంచి ఉద్యోగం చూశాడు. నాకు తెలిసి బహుశా నేను ఇక ఇండియాకు రాకపోవచ్చు'' అంది.

''మీ పేరెంట్స్ ?''

''వాళ్ళూ మాతో పాటూ అక్కడే ఉన్నారు''

''మరి మీ కాబోయే భర్త ఇండియాలో ఉంటే?''

''అమెరికాలో స్థిరపడ్డ ఇండియన్‌ని చేసుకొంటాను. అఫ్‌కోర్స్ అతని అయినవాళ్ళు ఇండియాలో ఉంటే నేను రాక తప్పదనుకోండి'' అంది నవ్వుతూ.

''వై డు యు హేట్ ఇండియా'' అతని కంఠంలో బాధ ధ్వనించింది.

''నో నో. ఇన్‌ఫ్యాక్ట్ ఐ లవ్ ఇండియా. మన శాస్త్రాలు, సాంప్రదాయాలు నాకెంతో యిష్టం. కాని అమెరికాలో వాళ్ళ క్రమశిక్షణ, శుభ్రతపై అవేర్‌నెస్ నాకు ఎంతగానో నచ్చింది''

''వాళ్ళిచ్చే డాలర్లు?''

''అవి యింకా బాగా నచ్చాయి'' అంది కాస్త గట్టిగా నవ్వుతూ.

''ఎన్నాళ్ళుంటారు ఇండియాలో?''

''ఎన్నాళ్ళా? ఎన్ని గంటలు అనండి. రేపు ఉదయం తిరుమల, మధ్యాహ్నం హైదరాబాదు రాత్రి ఫ్లైటుకి అమెరికా ప్రయాణం''

''అయితే మళ్ళీ నాకు కనబడను అంటారు''

''చూద్దాం. భగవంతుడు ఎవర్ని ఎప్పుడు ఎలా కలుపుతాడో, ఎందుకు విడదీస్తాడో మనకు అర్థం కాదు''

''అమెరికా వాళ్ళు వేదాంతం కూడా మాట్లాడతారా'' అంటూ నవ్వాడు. ఇంతలో ఎదురుగా ఇద్దరు పోలీసులు కారు ఆపమని సంజ్ఞ చేయడంతో ఆపాడు.


''కాస్త బయటకు వస్తారా?'' వాళ్ళలో ఒకతను అన్నాడు.

కారు దిగి కాస్త దూరంలో నిలబడ్డ ఎస్.ఐ.లాంటి వ్యక్తిని సమీపించాడు. 'మరో వ్యక్తి కానిస్టేబుల్ కావచ్చు' అనుకొన్నాడు.

''మీరు చెన్నై నుంచి వస్తున్నారా?''

''అవును''

''ఈ ఫొటోలోని ఆడ వ్యక్తి మీకు కనిపించిందా'' ఫొటో అందిస్తూ అన్నాడు ఎస్.ఐ.లా



ఉన్న వ్యక్తి. ఫొటో కనిపించడానికి తన చేతిలోని టార్చిలైటు ఫొటోపై ఫోకస్ చేశాడు అతడు.

ఫొటోలోని వ్యక్తిని చూసి ఉలిక్కిపడ్డాడు రమణ. అంతలోనే తేరుకొని ''కనిపించలేదు'' అన్నాడు.

''ఈ అమ్మాయి కిడ్నాప్‌కి గురయింది. అయిదు లక్షలు డిమాండ్ చేస్తున్నారు'' అన్నాడు.

''ఐ సీ'' అన్నాడు రమణ సాలోచనగా.

ఎస్.ఐ. ఆ ఫొటోని తన జేబులో పెట్టుకోబోతూ యధాలాపంగా ఆ ఫొటోను చూశాడు. వెంటనే...

''సారీ... పొరబాటుగా యింకో ఫొటో చూపాను. ఈ ఫొటోలోని అమ్మాయిని వాళ్ళు కిడ్నాప్ చేసింది'' అంటూ యింకో ఫొటో అందించాడు. ఆ ఫొటోను కూడా చూసి తిరిగి యిచ్చేస్తూ ''ఈవిడ కూడా కనిపించలేదు'' అన్నాడు.

''కారులో ఆవిడ మీ భార్యా?''

''కాదు కజిన్. మీరు మొదట చూపించిన ఫొటో ఎవరిది'' కుతూహలంగా అడిగాడు.

''ఆ అమ్మాయి పేరు జాహ్నవి. సూసైడ్ కేసు. ఈ రోజు తెలుగు పేపర్లలో వేశారే. చూళ్ళేదా?''

''లేదు. నేను ఉదయాన్నే చెన్నై వెళ్ళిపోయాను''

''మీరిక వెళ్ళొచ్చు. రాత్రుల్లో ప్రయాణాలు వీలైనంత వరకూ తగ్గించండి. గుడ్‌నైట్''

''గుడ్ నైట్ సార్. థాంక్యూ''

కారులో కూర్చుని స్టార్ట్ చేశాడు.

''వాట్ హేపండ్''

''ఎవరో అమ్మాయి కిడ్నాపింగ్‌కు గురైందట. మనకేమైనా కనిపించిందా అని అడిగారు''

''ఫొటో చూడగానే మీ మొఖంలో భయం కనిపించింది''

''భయం కాదు బాధ. మొదట పొరబాటుగా యింకో ఫొటో చూపారు. అందులోని అమ్మాయి చాలా అందంగా ఉంది. ఆమె ఆత్మహత్య చేసుకుందని చెప్పగానే నాకు చాలా బాధ కలిగింది'' అన్నాడు రమణ.

''వెరీ బాడ్. ఐ పిటీ హర్''

''లవ్ ఫెయిల్యూర్ కేసు. తిరుమల ఘాట్ రోడ్డుపై నుంచి లోయలోకి దూకి మరణించిందట''

''చదువుకున్న అమ్మాయేనా?''

''ఇంజనీరింగ్ ఫైనల్ చదువుతున్న అమ్మాయట. తల్లిదండ్రులకు ఏకైక సంతానం. పాపం ఈ వార్త విని వాళ్ళెలా తట్టుకుంటారో'' అన్నాడు.

కారు తిరుపతి టౌన్లో ప్రవేశించగానే ''మిమ్మల్ని ఎక్కడ డ్రాప్ చేయమంటారు'' అని అడిగాడు రమణ.

''మీరు వెళ్తూండండి. నేను దారి చెప్తాను'' అంటూ వన్‌టౌన్ పోలీసుస్టేషను ముందు కారు ఆపమని చెప్పింది. కారు ఆగగానే నలుగురు కానిస్టేబుల్స్ వచ్చి కారు చుట్టూ నిలబడ్డారు.

ఆమె రమణతో ''మిస్టర్ రమణా. యు ఆర్ అండర్ అరెస్ట్. జాహ్నవిని లోయలోకి తోసి చంపినందుకు మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాను'' అంది.

''వాట్ ద హెల్ యు ఆర్ టాకింగ్? లిఫ్ట్ యిస్తే థాంక్స్ చెప్పాల్సింది పోయి ఏమిటేమిటో మాట్లాడుతున్నారు. నేను వెళ్ళాలి. గుడ్‌నైట్'' అంటూ కారు స్టార్ట్ చేశాడు రమణ.

ఆమె తన బ్యాగ్ లోంచి రివాల్వర్ తీసి అతని వైపు గురిపెట్టి ''డోంట్ మేక్ అన్‌నెససరీ ఫస్. ఐ యామ్ విజయ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్'' అంది. మరేం మాట్లాడక కారు దిగి స్టేషన్‌లోకి నడిచాడు రమణ.

★ ★ ★


మరుసటి రోజు ఉదయం విలేఖరులతో మాట్లాడుతూ ఎస్.పి. రమణమూర్తి- ''ఈ కేసు యింత త్వరగా సాల్వ్ చేస్తామని మేము అనుకోలేదు. జాహ్నవి బాడీని మేం కనుక్కొన్నది నిన్న ఉదయమే. జాహ్నవి హాస్టల్ నుంచి బయలుదేరే

**సి.ఎన్.చంద్రశేఖర్**

ముందు హాస్టల్ ప్రక్కనున్న ఎస్.టి.డి బూత్ నుంచి రమణకు ఫోన్ చేసింది. మేం దర్యాప్తు చేయడానికి వెళ్తే ఆ షాపతను ఆ నెంబరు మాకిచ్చాడు. ఆ నెంబరు రమణ యింటి ఫోన్ నెంబరని తెలుసుకొని మఫ్టీలో మా వాళ్ళని పంపాను. రమణ చెన్నై వెళ్ళాడని, రాత్రి తిరిగి వస్తాడని అతని తల్లి చెప్పింది. చెన్నైలోని అతని మామగారింటి అడ్రసు తీసుకొని ఒక మనిషిని చెన్నై పంపి అతనిపై నిఘా వుంచాను. ఇంతలో మా విజయ ఒక అద్భుతమైన ఐడియా ఇచ్చింది. కారు బ్రేక్ డవున్, రమణతో పాటు ప్రయాణం, పోలీసులు రెండు ఫొటోలు చూపడం అన్నీ ఆమె ప్లానులో భాగమే. జాహ్నవి మరణవార్త పేపర్లో పడింది అనగానే కొన్ని ముఖ్యమైన విషయాలు విజయతో చెప్పాడు. జాహ్నవి ఇంజనీరింగ్ చదువుతూందని, తల్లిదండ్రులకు ఏకైక సంతానమని, ముఖ్యంగా తిరుమల ఘాట్ రోడ్డు మీది నుంచి లోయలోకి దూకి మరణించిందని. అతనితో మాట్లాడిన పోలీసులు ఈ విషయాలేమీ అతనికి చెప్పలేదు. పేపర్లో న్యూస్ రాలేదు. మరి అతనికెలా తెలిసింది? పైగా విజయ తను మరునాడే అమెరికా బయలుదేరుతున్నానని చెప్పడంతో ఆమె వల్ల తనకే యిబ్బందీ ఉండదనుకొన్నాడు. నోరు జారాడు. క్రెడిట్ గోస్ టు విజయ'' ఆమెవైపు అభినందన పూర్వకంగా చూస్తూ అన్నాడు.

''మరి హత్యకు మోటివ్ ఏమిటి?'' ఒక విలేఖరి ప్రశ్నించాడు.

''రమణ సివిల్ ఇంజనీరు. కాంట్రాక్టర్‌గా ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నాడు. అతనికి ఇంజనీరింగ్ చదువుతున్న జాహ్నవితో పరిచయమైంది. ఆమె చదువుతున్నదీ సివిల్ ఇంజనీరింగే కాబట్టి డౌట్సు క్లారిఫికేషన్ కోసం తరచుగా రమణను కలిసేది. ఆ పరిచయం ప్రేమగా మారింది. ఆమె చదువు పూర్తికాగానే పెళ్ళి చేసుకోవాలని అనుకొన్నారు ఇద్దరూ. ఎటూ పెళ్ళి చేసుకోబోతున్నాం కదా అనే ధైర్యంతో శారీరకంగా కూడా కలిశారు చాలాసార్లు. ఈమధ్య తిరుపతిలో పెద్ద హోటల్ కడుతున్న కాంట్రాక్టర్‌తో రమణకు పరిచయమైంది. ఆ బిల్డింగ్‌కు రమణే ఇంజనీరు. రమణ అందం, టాలెంట్ చూసి తన కూతురి పెళ్ళి ప్రపోజల్ రమణ ముందు పెట్టాడు. సమాజంలో ఆర్థికంగా బాగా ఎదగాలని ఆశపడుతున్న రమణకు ఆయనిచ్చే కట్నం, లాంఛనాలూ, ఆయన ఆస్తి ఎంతో నచ్చాయి. వెంటనే ఆయన కూతురితో పెళ్ళికి ఒప్పుకొన్నాడు. పెళ్ళి చెన్నైలో జరిగింది. ఈ విషయాలేవీ జాహ్నవితో చెప్పలేదు రమణ. అతడు తిరుపతిలో కాపురం పెట్టిన కొద్దిరోజులకు జాహ్నవికి విషయం తెలిసి అతనిపై విరుచుకుపడింది. అతడు ఎలాగో సర్దిచెప్పి ఆమెకు అన్యాయం చెయ్యనని, కొద్దిరోజులు ఓపిక పట్టమని నచ్చచెప్పాడు. ఎన్నిరోజులు వేచినా అతడు కలవడం కానీ, పరిష్కారం చూపడం కానీ చేయనందువల్ల రెండు రోజుల క్రితం అతనికి ఫోన్ చేసి తను నేరుగా అతని యింటికే వస్తున్నానని, అతని భార్యతో మాట్లాడి- తాడో పేడో తేల్చుకుంటానని చెప్పింది. రమణ ఎంత వారించినా ఆమె వినలేదు. రమణ వెంటనే ఆటోలో బయలుదేరి జాహ్నవిని మార్గమధ్యంలో కలిశాడు. ఆమె స్కూటీని తనే డ్రైవ్ చేస్తూ తిరుమల రోడ్డు వైపు నడిపించాడు. దారి పొడవునా ఆమెను కన్విన్స్ చెయ్యడానికి ప్రయత్నించాడు. ఘాట్‌రోడ్డుపై అయిదు కిలోమీటర్లు ప్రయాణించి ఒక చోట ఆపి వాదులాడుకొన్నారు. జాహ్నవి తనకు జరిగిన అన్యాయాన్ని రమణ మామగారికి, పత్రికలవారికి,



మహిళా సంఘాలకు చెబుతానని అనడంతో ఆమె వల్ల తనకు ఎప్పటికైనా ప్రమాదమే అని భావించి జాహ్నవి ఏమరుపాటుగా ఉన్నప్పుడు లోయలోకి త్రోసివేశాడు. తను కొద్దిదూరం నడచి బస్సులో ఎక్కి కొండదిగి వచ్చేశాడు'' అని వివరించాడు ఎస్.పి.

★ ★ ★

''ఏం విజయా. డల్‌గా ఉన్నావేం? దిసీజ్ సెలబ్రేషన్ టైం ఫర్ యు'' ఎస్.ఐ. తేజ అన్నాడు విజయతో.

''దోషిని పట్టుకొనేంత వరకూ నాలో ఆవేశం, పట్టుదల ఉన్నమాట వాస్తవం. కానీ తీరా అతన్ని అరెస్ట్ చేశాక విజయం సాధించిన ఆనందం నాకు కలగటం లేదు. జాహ్నవిని గురించి ఆలోచిస్తూంటే ఎంతో బాధగా వుంది. మగవాళ్ళమని, తాము ఏమి చేసినా చెల్లుతుందనే అహంకారంతో ఈ కాలం కుర్రాళ్ళు కొందరు అమ్మాయిల్ని ట్రాప్ చేయడం, శారీరకంగా, ఆర్థికంగా వాడుకోవడం, ఆమెతో తమకు ప్రమాదం అనుకొన్నప్పుడు చంపేయడం చూస్తూంటే మనం వాళ్ళను రక్షించలేకపోతున్నామే అని బాధగా ఉంది'' అంది విజయ.

''కమాన్ విజయా. డోంట్ బి సెన్సిటివ్. నువ్వు పోలీసాఫీసర్ అన్న విషయం మరచిపోకు'' తేజ అన్నాడు.''కానీ నేను ముందు మనిషిని. తర్వాతే పోలీసాఫీసర్ని''

''నిజమే. మనమేం చేయగలం చెప్పు. అన్నీ అయిపోయాకే మన పని ప్రారంభమవుతుంది. ఏదీ కాకుండా చేయగల శక్తి ఈనాటి ఆడపిల్లలకే వుంది. ఎవర్నీ నమ్మకుండా, ముందు చదువు పూర్తిచేసి, ఆ పై తల్లిదండ్రులు చూపిన సంబంధమో, లేదా తమకు నచ్చిన వాడినో తల్లిదండ్రుల అనుమతితో పెళ్ళి చేసుకొంటే ఏ బాధా వుండదు. పెళ్ళయ్యే వరకూ ఎవరితోనూ విచ్చలవిడిగా తిరగకుండా, ముందూ వెనుకలు ఆలోచించి ప్రవర్తించే అమ్మాయిల భవిష్యత్తు అందంగా ఉంటుంది''

''యు ఆర్ రైట్ తేజా. ఇకపై ఆడపిల్లల్లో, వాళ్ళ తల్లిదండ్రుల్లో ఈ అవేర్‌నెస్ రావడం కోసం సెమినార్లూ, టీవీ ఛానల్స్‌లో ప్రోగ్రాములూ కండక్ట్ చేద్దాం. మనవంతు కర్తవ్యాన్ని నిర్వహిద్దాం'' దృఢ నిశ్చయంతో అంది విజయ.

''ష్యూర్. నువ్వు మొదలుపెట్టు. అయామ్ విత్ యు''

''థాంక్యూ'' ఆనందంగా అంది విజయ.

## రాణీ ఆశలు

**ఆశ మనిషికి ఆక్సిజన్‌లాంటిది. రెక్కాడితే గానీ డొక్కాడని అతి సామాన్యుల నుంచి కోట్లకు పడగలెత్తిన వారూ ఆశపడుతుంటారు. సినిమాతారలు తమ ఆశల్ని తమ క్యారక్టర్ల ద్వారా నెరవేర్చుకుని సంతృప్తిచెందుతుంటారు. హీరో, హీరోయిన్లు తాము చిరకాలం నుంచి ఆశిస్తున్న క్యారెక్టర్లు లభిస్తే ఎంతో సంతోషిస్తారు. 'రైల్లో ప్రయాణిస్తూ యూరోప్ అంతా చూడాలని ఉంది. ప్రశాంతంగా ఉండే పల్లె అందాలని వీక్షించాలని ఉంది. నదుల్లో జలకాలాడాలని ఉంది. ఎత్తైన కొండల్ని చూస్తూ కాలాన్ని మరచిపోవాలని ఉంది'అంటూ కవితా ధోరణిలో తన కోరికల్ని బయటపెట్టింది రాణీ ముఖర్జీ. వెరీగుడ్ రాణీ! కెమేరాల్లో బంధించే కృత్రిమఅందాల్ని ఎంత సేపు ఆస్వాదిస్తాం. సింపుల్‌గా ఉన్న నీ ఆశలు నెరవేరాలని అంతా కోరుకుంటున్నారు.**